నిరుద్యోగం.. నివారణా చర్యలు!

మొదటి ప్రణాళిక కాలం నుంచే దేశంలో నిరుద్యోగ నిర్మూలనకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. ప్రణాళికా యుగంలో అనేక స్వయం ఉపాధి, వేతన ఉపాధి పథకాలను ప్రవేశపెట్టినప్పటికీ.. నిరుద్యోగ నిర్మూలన సాధ్యం కాలేదు. సంవత్సరంలో 100 రోజులు ఉపాధి కల్పించే 'జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం'ను ప్రభుత్వం 2006, ఫిబ్రవరిలో అమల్లోకి తెచ్చింది. ఈ పథకం గ్రామీణ ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరుస్తుందనడంలో సందేహం లేదు. అయితే, నిరుద్యోగ నిర్మూలనకు దీర్ఘకాల చర్యలు మాత్రమే సంతృప్తికరమైన ఫలితాలను ఇస్తాయి!!

నేషనల్ శాంపిల్ సర్వే.. దేశంలో నిరుద్యోగాన్ని అంచనా వేసేందుకు... సాధారణ నిరుద్యోగ స్థితి, వారంవారీ నిరుద్యోగ స్థితి, రోజువారీ నిరుద్యోగ స్థితి.. అనే మూడు భావనలను ప్రవేశపెట్టింది. నిరుద్యోగంపై 1971లో బి.భగవతి అధ్యక్షతన ఏర్పాటైన నిపుణుల కమిటీ అంచనా ప్రకారం... 1973లో 18.7 మిలియన్ల మంది నిరుద్యోగులు ఉండగా... గ్రామీణ ప్రాంతా లలో 16.1 మిలియన్ల మంది, పట్టణ ప్రాంతాలలో 2.6 మిలియన్ల మంది నిరుద్యోగులుగా ఉన్నారు. అదే సంవత్సరం మొత్తం శ్రామిక శక్తిలో... నిరుద్యోగితా శాతం 10.4%. కాగా, గ్రామీణ ప్రాంతాలలో 10.9%, పట్టణ ప్రాంతాలలో 8.1% గా ఉంది.

కొలమానంగా రోజూవారీ స్థితి:

ఉద్యోగిత, నిరుద్యోగితలకు సంబంధించి రోజువారీ స్థితి కొలమానాన్ని ప్రామాణికంగా భావిస్తారు. రోజువారీ స్థితి అంచనా ప్రకారం.. 1993-94 నుంచి 1999-2000 మధ్య కన్నా... 1999-2000 నుంచి 2004-05 మధ్య కాలంలో ఉద్యోగితా వృద్ధి వేగవంతమైంది. 1993-94 నుంచి 1999-2000 మధ్య కాలంలో... 24 మిలియన్ల మందికి ఉపాధి లభించగా.. 1999-2000 నుంచి 2004-05 మధ్య కాలంలో 47 మిలియన్ల మందికి ఉపాధి అవకాశాలు పెరిగాయి. ఇదే కాలానికి అదే సంవత్సరానికి సంబంధించి ఉద్యోగితా వృద్ధి ఏటా 1.25% నుంచి 2.62%కు పెరిగింది. శ్రామికశక్తి వేగంగా 2.84 శాతం వృద్ధి సాధించినందు వల్ల నిరుద్యోగిత రేటు పెరిగింది. రోజువారీ స్థితి ఆధారంగా.. నిరుద్యోగిత 1999-00లో 7.31% నుంచి 2004-05లో 8.28%కు పెరిగింది. 1993-94 నుంచి 1999-00 మధ్య ఉద్యోగితలో వృద్ధి మందగించడానికి వ్యవసాయ రంగంలో ఉపాధి తగ్గడమే కారణం. ఈకాలంలో మొత్తం ఉద్యోగితలో వ్యవసాయ రంగ వాటా... 61 శాతం నుంచి 57 శాతానికి తగ్గింది. ఇదే ధోరణి తర్వాతి కాలంలోనూ కొనసాగి, వ్యవసాయ రంగం వాటా 52 శాతానికి తగ్గింది.

ఈ కాలంలో తయారీ రంగ వృద్ధి కొద్దిగా పెరగ్గా.. వాణిజ్యం, హోటళ్లు, రెస్టారెంట్లు మొత్తం ఉద్యోగితలో ప్రాధాన్యత కనబరిచాయి. రవాణా రంగం,సమాచార రంగం, బీమా, రియల్ ఎస్టేట్, వ్యాపారం, సామాజిక సేవలు, వ్యక్తిగత సేవల రంగాల్లోనూ ఉపాధిలో పెరుగుదల సంభవించింది.

శ్రామికశక్తిలో మహిళలు:

1983 నుంచి 2004-05 మధ్యకాలంలో.. శ్రామిక శక్తిలో పురుషుల భాగస్వామ్యం ఎక్కువ కాగా.. మహిళల భాగస్వామ్యం పట్టణ ప్రాంతాల కన్నా గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ ఉంది. 2004-05లో పట్టణ ప్రాంతాల్లో..మొత్తం పురుష శ్రామికుల ఉపాధిలో.. వాణిజ్యం, హోటళ్లు, రెస్టారెంట్ల వాటా 28 శాతం. కాగా తయారీ రంగం 24 శాతం, ఇతర సేవల వాటా 21 శాతం. పట్టణ ప్రాంతాల్లోని మహిళలకు మొత్తం ఉపాధిలో సేవారంగం ద్వారా లభించిన ఉపాధి 36 శాతం. 28 శాతం వాటాతో తయారీ రంగం తర్వాతి స్థానంలో ఉంది. NSSO అంచనా ప్రకారం... గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత విద్యావంతులైన మహిళలు, పురుషుల్లో నిరుద్యోగిత రేటు 1999-2000 నుంచి 2004-05లో తగ్గింది. సంఘటిత రంగంలో ఉపాధి వృద్ధి (ప్రభుత్వ, ప్రైవేటు రంగం కలిపి) 1994 నుంచి 2005 మధ్య తగ్గింది. ప్రభుత్వ రంగంలో ఉపాధి తగ్గడం దీనికి కారణం. ఇదే కాలంలో ప్రైవేటు రంగంలో ఉపాధి వృద్ధి 0.44 శాతం నుంచి 0.58 శాతానికి పెరిగింది. అసంఘటిత రంగంలోని పరిశ్రమలపై ఏర్పాటైన జాతీయ కమిషన్ అభిప్రాయంలో... సంఘటిత రంగంలో ఉపాధి 1999-2000లో 54.12 మిలియన్ల నుంచి 2004-05లో 62.57 మిలియన్లకు పెరిగింది.

నిరుద్యోగ నిర్మూలన:

మొదటి ప్రణాళిక కాలం నుంచే దేశంలో నిరుద్యోగ నిర్మూలనకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. ప్రణాళికా యుగంలో అనేక స్వయం ఉపాధి, వేతన ఉపాధి పథకాలను ప్రవేశపెట్టినప్పటికీ.. నిరుద్యోగ నిర్మూలన సాధ్యం కాలేదు. ఎక్కువ ఉపాధి అవకాశాలు లక్ష్యంగా ప్రారంభించిన చిన్నతరహా పరిశ్రమలకు అనేక రాయితీలు, ప్రోత్సాహకాలు ఇచ్చారు. మానవ వనరుల అభివృద్ధికి అనేక చర్యలు చేపట్టారు. 7వ ప్రణాళికలో శ్రామికశక్తి వృద్ధి కన్నా .. ఉద్యోగితా వృద్ధి పెంచాలని లక్ష్యంగా నిర్ణయించారు. 9వ ప్రణాళికలో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యమిచ్చారు. సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన,

ప్రధానమంత్రి గ్రామోదయ యోజన, స్వర్ణజయంతి గ్రామ స్వరోజ్‌గార్ యోజన, స్వర్ణజయంతి షహరీ రోజ్‌గార్ యోజన తదితర పథకాలు ప్రారంభించారు. 10వ ప్రణాళికలో.. అసమానతలు తొలగించాలని.. 9వ ప్రణాళికలో ప్రారంభించిన కార్యక్రమాలను పటిష్టపరచాలని లక్ష్యంగా నిర్ణయించినప్పటికీ.. ఆశించిన ప్రయోజనాలు చేకూరలేదు. ప్రభుత్వ కార్యక్రమాలు స్వల్పకాల ప్రయోజనాలకేపరిమితమయ్యాయి. పనిచేయగలిగే సామర్థ్యం ఉన్నవారికి సంవత్సరంలో 100 రోజులు ఉపాధి కల్పించే... 'జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం'ను 2006, ఫిబ్రవరిలో ప్రవేశపెట్టారు. ఈ పథకం గ్రామీణ ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరుస్తుందనడంలో సందేహం లేదు. అయితే, నిరుద్యోగ నిర్మూలనకు దీర్ఘకాల చర్యలు మాత్రమే సంతృప్తికరమైన ఫలితాలను ఇస్తాయి.

- సంస్కరణల యుగంలో వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలు మందగించడంతో... 1990లలో ఉపాధికల్పనపై ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. ఉపాధికల్పన పెంచాలంటే.. వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయాలి.

- హరిత విప్లవ ప్రాంతాల్లో సరైన వృద్ధి జరిగినప్పటికీ.. ఉత్పాదకతలో అంతర్జాతీయ స్థాయికి చేరుకోవాల్సిన అవసరముంది. సాగులో వెనుకబాటుకు గురైన రాష్ట్రాలు బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఒరిస్సాలలో.. ఉత్పత్తి, ఉత్పాదకత పెంచాలి. వ్యవసాయ ఉత్పాదకత పెంచడంలో నీటిపారుదల, వాటర్‌షెడ్ అభివృద్ధి ప్రధాన పాత్ర పోషిస్తాయి. తద్వారా ఉపాధి పెరుగుతుంది.

- తయారీ రంగంలో ప్రధాన భూమిక నిర్వహించే చిన్నతరహా పరిశ్రమలకు సంబంధించి Dereservation విధానాన్ని విరమించుకోవాలి. ఎక్కువ ఉపాధి ధ్యేయంగా ఉన్న ఈ పరిశ్రమలకు రక్షణ విధానాన్ని ప్రభుత్వం అవలంభించాలి. జపాన్‌లో చిన్నతరహా పరిశ్రమలకు 2 శాతం వడ్డీపై ప్రభుత్వం రుణసౌకర్యం కలగచేస్తోంది. ఈ విధానాన్ని మన ప్రభుత్వం కూడా అమలుచేయాలి.

- 2001 జనాభా లెక్కల ప్రకారం... పట్టణాలు, నగరాల్లో 40.6 మిలియన్ల ప్రజలు మురికివాడల్లో నివసిస్తున్నారు. మొత్తం నగర జనాభాలో వీరు 22.8 శాతం ఉన్నారు. వీరిలో విద్య, ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపరచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లయితే... పనిలో పాలుపంచుకొనే రేటు పెరిగి, ఆర్థిక కార్యకలాపాలు విస్తృతమవుతాయి. గ్రామీణ మౌలిక సౌకర్యాలు ఆర్థిక ప్రక్రియను వేగవంతం చేస్తాయి. రోడ్ల విస్తరణ, డ్రైనేజీ సౌకర్యాలు,గ్రామీణకమ్యూనిటీ ఆస్తుల పెంపుదలకు చర్యలు ప్రారంభిస్తే... ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

- ఐటీ పరిశ్రమ ఉపాధి అవకాశాలు పెంచగలదు.ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల వారికి కంప్యూటర్ విద్యను అందించడం ద్వారా... మానవ వనరుల సామర్థ్యాన్ని పెంచినట్లయితే ఐటీ రంగంలో మంచి నాణ్యత గల ఉపాధి లభిస్తుంది.

ప్రశ్నలు

1. సాధారణ స్థితి నిరుద్యోగిత అంటే..? సర్వే జరిపే కాలానికి సంబంధించి ఒక సంవత్సరంలో ఎక్కువ కాలం నిరుద్యోగిత ఉన్న స్థితి.
2. వారం వారీ స్థితి నిరుద్యోగిత అంటే..? సర్వే జరిపే వారంలో కనీసం ఒక గంట కూడా పనిదొరకని నిరుద్యోగ స్థితి.
3. రోజువారీ స్థితి నిరుద్యోగిత అంటే..? సర్వే నిర్వహించే వారంలో పని లభ్యమయ్యే స్థితి. ఒక వ్యక్తికి రోజులో 1 గంట నుంచి 4 గంటలు మించి లభ్యమయితే సగం పనిదినంగా.. 4 గంటలు మించి లభ్యమయితే ఒక పనిదినంగా లెక్కిస్తారు.
4. అభివృద్ధి చెందిన దేశాల్లో తాత్కాలిక ఘర్షిత నిరుద్యోగం ఉంటుందని చెప్పింది? కీన్స్.
5. సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన ఎప్పుడు ప్రారంభించారు? 2000, సెప్టెంబర్.
6. జాతీయ గ్రామీణ రోజ్‌గార్ గ్యారంటీ చట్టం ఎప్పుడు అమల్లోకి వచ్చింది? 2006, ఫిబ్రవరి.
7. వాల్మీకి అంబేద్కర్ ఆవాస్ యోజన లక్ష్యం ఏమిటి? పట్టణ ప్రాంతాల్లో మురికి వాడల్లో నివసించే వారికి గృహనిర్మాణం.
8. నిరుద్యోగ అంచనాలకు సరైన భావన? రోజువారీ స్థితి నిరుద్యోగ భావన.
9. ఉపాధి హామీ పథకాన్ని మొదట ప్రారంభించిన రాష్ట్రం ఏది? మహారాష్ట్ర, 1972-73.
10. 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం ఏ సంవత్సరంలో ప్రకటించారు? 1975లో